

# సాపేక్షకం

పాలడుగు వెంకటేశ్వరరావు



ఎండ చుర్రుమంటూవుంది. మలమలా మాడ్చేస్తూవుంది. భూమి సెగలు గ్రక్కుతూవుంది. దయలేదు, జాలిలేదు, కరుణా కటాక్షం అసలే లేదు. ఉన్నవాడా - పర్లేదులే- లేనివాడూ దరిద్రుడూ - రెక్కాడితే గాని డొక్కాడని అల్పజీవిగదా - అయ్యో, పాపం ఎట్లా?- అన్న విచక్షణాలేదు సూర్యుడికి. తేడంటే లేదది, అసలే లేదు. మబ్బుతునకేలేని ఆకాశం మధ్యన, అడ్డూ అదుపూ లేకుండా తీవ్రంగా మండుతూవున్న కొలిమి లాగా, పేట్రేగిపోతూ వున్న సూర్యుని ప్రతాపానికి, చెట్లూ, చేమలూ, ఆకులూ అలములూ, కుక్కలూ, కోళ్ళూ, గేదెలూ, ఆవులూ, వున్నవాళ్ళూ, లేనివాళ్ళూ, సమస్తమూ గుడిసెలూ, మేడలూ, కార్లూ, సైకిళ్ళూ, రిక్షాలూ - వాటి స్వంతదారులూ - ఈ భూమ్మీద వున్న సమస్తమూ - అల్లాడి, వేడెత్తిపోయి, నానా విధాలుగా అవస్థ పడి ఆప సోపాలు పడ్తూవున్నాయి. ఉస్సురుస్సురని తెగ రొప్పుతున్నాయి. గిజగిజలాడ్తున్నాయి. ఎండకి జడిసి రోడ్డూ వల్లబడింది. రోడ్డు మీద

ఎండమావులు ఆటలాడు కుంటున్నాయి. రోడ్డు ప్రక్కనే చెట్లక్రింద రిక్షాల్నా పుకుని కాళ్ళుదాపుకుని, చేతులు వేలాడేసి, అలుపు తీర్చుకుంటున్నారు రిక్షాల వాళ్ళు, ఇప్పుడొక కారూ, అప్పుడొక లారీరోడ్డు మీద దూసుకుని పోతూవుంది, భయం భయంగా, హడావుడిగా, తొందరగా.

రాం పుల్లయ్య వగరుస్తూ, అంగలు పంగలు వేసుకుంటూ రోడ్డు వెంట ఒంటరిగా సాగిపోతున్నాడు. చమటకి చొక్కా తడిసింది. కాళ్ళుదుమ్ము గొట్టుకునివున్నాయి. చిన్నప్పటి నుండి మట్టి పిసుక్కుని మట్టిలో పెరిగిన శరీరం. చమటోడ్చి కష్టపడి రాటుదేలిన ఆరడుగుల ఆజాను బాహువు రాంపుల్లయ్య.

వూరిబయట ఆపీసులున్నాయి. ఆ ఆపీసులకి వచ్చిపోయే జనాలకోసం ఆ రోడ్డువారనే కిల్లికొట్లూ, కూల్డ్రింకు షాపులూ, టీ బంకులూ వెలిసేయి. సాధారణంగా జనాలతో ముమ్మరంగా వుండే, ఆ బంకులు కూడా బోసి పోయివున్నయి.

దాహం. పదినిముషాల్నుండీ దాహంగా వుంది రాంపుల్లయ్యకి అట్లాగే బండగా మొండిగా పడక సాగిస్తూన్నాడు. ఆ మొండితనానికి కూడా ఒక హద్దు వుంటుంది. అందువలన — ఇక తట్టుకో లేక - ఎదురుగా వున్న కిల్లీ కొట్టు దగ్గరకి గబగబా వెళ్ళాడు రాంపుల్లయ్య. రాంపుల్లయ్య వంక వోర చూపులు చూస్తూ - గోళ్ళు గిల్లుకోటం ఆపి ఏం గావాలి? కిల్లీకొట్లో కూర్చుని వున్న గారపళ్ళ అబ్బాయి - ఇకిలించి అడిగాడు. ముందువెనుకలు కానక చిందులు తొక్కూతూ వున్నవయస్సు అతనిది.

"దాహంగావుంది" అన్నాడు రాంపుల్లయ్య.

"ఏం గావాలి? కూల్డ్రింకు తాగుతావా? రెండున్నరా" - అన్నాడు కుర్రాడు.

"అమ్మ! రెండున్నరే! రూపాయలేనా?"

"మరే మనుకున్నావు? చిల్లపెంకులనుకున్నావా? రూపాయలే నాయనా"

"అయితే వద్దులే, గానీ-"

"మరేం గావాలి?"

"నీళ్ళు! తాగటాన్కి నీళ్ళుగావాలి"

"నీళ్ళా? నీళ్ళులేవు" - ఖండితంగా చెప్పాడు, కుర్రాడు.

"లేవా"?

"చెప్తుంటే అర్థంగాదా? లేవంటే లేవనేగదా అర్థం?"

"మరెట్లా?! దాహంగావుంది. దీనమ్మ! ఎండల్జూడు? ఎట్టెట్టా వున్నాయో? పుట్టి బుద్దెరిగినాక నేనెరగనంటే నమ్ము" - రొప్పాడు.

"అవున్లే. పోనీ - కలరు తాగుతావా? రూపాయి!"

"వద్దులే నాకు పడదు, డోకొచ్చుతుంది",

"అయితే నీ దార్ని నువుబో. ఏం చేస్తాం?"

"అంతేగాని నీళ్ళు ఇవ్వనంటావు! కాస్త కనికరమన్నా లేకపోతే ...

"ఏందయ్యో? ఏంటి నీ దబాయింపు? ఆ!"

"దబాయింపుగాదు దాహమని తాగటాన్కి నీళ్ళు అడిగాను, ఇస్తే నీ సొమ్మేం పోయింది? ఇవ్వటం న్యాయంగదా? అది ధర్మంగదా"

"రెండున్నరపెట్టి కూల్డ్రింకు కొనుక్కొని తాగమన్నానుగదా నిన్నే తాగమన్నానుగానీ నాకు తాగించమనలేదు గదా! నీ సొమ్ము నిన్నే ఖర్చు పెట్టుకోమన్నానుగాని నాకిమ్మన్నానా? అందులో అధర్మం ఏముందయ్యా పెద్దమనిషీ?"

"నిజమేననుకో. నా చిన్నతనంలో రెండున్నరకి బస్తావడ్లు వచ్చే వనేవారు."

"ఆ రోజులు వేరు- కాలం మారిందని తెలియదా? ధరలు పెరిగేయ్,

"చూస్తూచూస్తూ ఆ రంగు నీళ్ళకి రెండున్నర ఎట్లా తగలేసేది?"

"నిజమే. నిన్ను నేను బలవంతం చెయ్యలేదుగదా? నీదాన్ని నువుతాగా నంటే నిన్ను నేను చొక్కాపట్టుకుని ఆపలేదుగదా? తాగుతావా చస్తావా అన లేదుగదా?"

"నేనూ కాదంటంలేదు గానీ; నా దాహంతీరేదెట్లా? గొంతు ఆర్చుక పోతావుంది. నాలుక పిడచగట్టుకపోతావుంది. ప్రాణం కడంటుతావుంది"

"ఇదుగోనయ్యో! పెద్దమనిషి! నీతో తిరిగ్గా మాటాడ్డానికి నాకు కుద రదుగానీ—"

"పోనీ నన్ను తీసి అట్లావుంచులే. కొనుక్కుతాగటాన్కి డబ్బుల్లేని ఒక దరిద్రుడు ఇట్లాగే అల్లాడి - దాహంతో నీర్సపడి రోడ్డు మీద నిలబడ్డా డనుకో అడిగతేంటి? ఆ సంగతి ఆలోచించు. పెరిగి పెద్దాడివి అవాల్సిన కుర్రాడివి గదా."

"అదంతా నాకెందుకయ్యా? నేనూ నీలాంటి వాణ్నే, పావల్డబ్బులకోసం ఇక్కడ ఇట్లాపడివుండేవాణ్ణే - మా అన్న పనిమీదబోతూనన్ను కూర్చోపెట్టి వెళ్ళాడు."

"మనిద్దరి సంగతీ అట్లావుంచుదాం: ఇంకబోతే —"

"చాల్చాల్లే. వెళ్ళిరావయ్యా, పెద్దమనిషి నీకేం పనీ పాటా వున్నట్లుగా అసలులేదే! దాహమని ఒకప్రక్కన చెవ్వూసోది పెట్టున్నావ్-"

తుర్రున సైకిలేసుకొచ్చి ఆగాడు ఒక కుర్రాడు. బుస్సున కూల్డ్రింకు కొట్టి అతని కందిచ్చాడు కిల్లీకొట్టు గారపళ్ళ కుర్రాడు - పళ్ళికిలిస్తూ తాగి డబ్బులిచ్చి, సైకిలు కుర్రాడు బాణంలాగా దూసుకుపోగా - ఇంకా అక్కడ్నే నిలబడి వున్న రాంపుల్లయ్యని చూసి - ఇంకా ఇక్కడ్నే వుండావా? — అన్నాడు.

"నీళ్ళివ్వకపోతే మానే, ఇచ్చేచోటయినా చూపించి పుణ్యంకట్టుకోమన్నారు గదా"— అన్నాడు రాంపుల్లయ్య, గుటకలు మింగుతూ.

"అంటే ఏంటి నీ వుద్దేశ్యం? ఆఁ!"

"నాలుకపీకుతాంది. గొంతు ఆర్చుకపోతావుంది. దాహంతో పేగు అల్లాడి పోతావుంది. తాగటానికి మంచినీళ్ళుగావాలి."

"సరే, నేనొకటడుగుతాను నిజంగా నీదగ్గరడబ్బుల్లేవా? అజ్జెప్పు ముందు" "వున్నాయి. లేవని నేనన్నానా?"

మరింకేమిటి? ఒక డ్రింకు కొనుక్కొని తాగిపోరాదా?

"ఒక్కసీసా రంగునీళ్ళని, రెండున్నర తగలేయటాన్కి మనసొప్పటం లేదు."

"—అది నీఖర్మ. దానికి నేనేంజెయ్యను" నిట్టూర్చాడు కుర్రాడు.

"నీ దగ్గర నీళ్ళు లేక పోతే - నీళ్ళున్నచోటయినా చూపించమని గదా-"

"ఓరినీతస్సాదియ్య! నీ సంగతి గమ్మత్తుగావుందే! ఇంత వరకూ నీ లాంటివాడ్ని నేను చూడలేదంటే నమ్ముతావా, పెద్దమనిషీ?"

"అయితే నన్ను బొమ్మంటావా?"— అని నీర్సంగా నాలుగడుగులు వేసాడు రాంపుల్లయ్య, వెనక్కితిరిగి. అడుగులు తడబడ్డాయి. నిట్టూర్పులు వెచ్చగావచ్చాయ్.

"తస్సాదియ్య! గ్నాపకాని కొచ్చింది! ఇదుగో మునలయ్యో! అటుజూడు" అని — అరిచాడు వెనకనించి, గారపళ్ళ బడ్డీ కుర్రాడు.

"చూస్తున్నావే చెప్పు"

"ఇదుగో! ఈరోడ్డమ్మటే అట్లాగే పోయావంటే, ఆ మామిడితోట దగ్గర ఒక పాకవుంది. ఒక పెద్దమనిషి చలివేంద్రం పెట్టి దార్ని పోయే వాళ్ళకి మంచి నీళ్ళిమ్మని ఏర్పాటు చేసాడని విన్నాను, అడకి బోయి అడుగు."

"అట్లాగే"

జాగర్త." కుర్రాడిగొంతులో ఆత్మీయత తొంగిచూసింది.

"అట్లాగేలే"

పోయిపోయి - ఆ పాక- రెండు ఫర్లాంగులు నడిస్తేగాని అవుపడలేదు, కొత్త తాటాకులతో నిలబెట్టిన ఆ పాకలో ఒక మూలన నాలుగు పెద్దపెద్ద బానలు పెట్టివున్నాయి. ఇవతలివారన ఒక బెంచీవుంది. ఆ బెంచీ మీద ఒక లావుపాటి శాస్త్రి పడుకుని కునుకుతున్నాడు.

రాంపుల్లయ్య పిల్చాడు "ఏమయ్యో! లెగు లెగూ"

ఉలూకూ పలుకూ లేదు, ఆశాస్త్రి నుండి.

"ఏమయ్యో! పెద్దమనిషీ"- అరిచాడు రాంపుల్లయ్య

ఆ అరుపుకి వులికిపడి, కళ్ళు తెరిచిన, ఆ లావుపాటాయన కళ్ళెర్రజేసి లేచి కూర్చుని, ఏం గావాలన్నట్లు తల ఎగరేసాడు, కోపంగా

"దాహంగావుంది. నీళ్ళుకావాలి!"

"కావాలి."

నీకాక్కడయ్యా నాక్కావాలంటన్నాను, ఇంటన్నావా?"

"నాకూకావాలనిగదా, నేనంటా? నువ్వా ఇనిపిచ్చుకుంటన్నావా, అని?"

"మరి ఇక్కడ నువ్వు ఏం చేస్తున్నట్టూ?"

"కనబట్టంలా?? బస్సు కోసమని, ఇక్కడపడి వుండాను."

మా బాగుంది. అయనెవరో చలివేంద్రం పెట్టి నిన్ను ఆ సంగతి చూసుకోమనటమేంటి? నీవు బస్సుకోసం వచ్చాననిచెప్పి ఇక్కడబల్ల మీద పడి నిద్రపోవటంమేంటి? చాలా బాగుందయ్యా, నాయనా"

"ఆ మాట నీకెవరు చెప్పారు? ఇది మాబాగావున్నట్టుంది గడ!"

"అడనెవరో కుర్రాడు చెప్పాడులే."

"అడికి బుర్రలేదు. ఆమాటని నమ్మి వచ్చిన నీకూ బుర్రలేదు."

"ఏంటయో? ఇదిగా మాట్లాడతావుండావు!?"

"మరేంటి స్వామీ! నేనేదో బస్సు కోసమని వడిరావటమేంటి? దీనమ్మ! ఈ ఎండదెబ్బకి అల్లాడి, బల్లమీద కూర్చున్నానో లేదో కునుకు రావటమేంటి? నువ్వువచ్చి నన్నులేపి కూర్చోబెట్టి ఇట్లా దబాయించటమేంటి? ఏమన్నా వద్ద తిగావుందా?! ఇదేంటయ్యా నాయనా?"

"అట్లాగా! నాకు దెలీదు ఇట్లాగని, సర్లెగాని ఇప్పుడు ఎట్లాగని?"

"ఏంటి నీ యవహారం?"

"దాహంగావుంది. నీళ్ళుగావాలి. ఇంతేగదా నేనడిగింది"

"చూడబోతే నువ్వూ నాలాగే అమాయకుడిలాగావున్నావే? నన్నేంజెయ్య సుంటావయ్యా? ఈ బానలన్నీ కాళీ. దిక్కూ మొక్కూ లేని చలివేంద్రం ఇది"

అర్థంగావటంలా!? నీళ్ళుగావాల, దాహం, దాహం!? అతను చాలా సేపు ఆలోచించి అన్నాడు? ఇదుగో! గావకానికి వచ్చింది, నువ్వు అడిగావు గనుక చెప్పుతున్నా, ఆ ఎనుక మర్రిచెట్టువుంది. దానికింద నుయ్యివుంది. అడకి బో మరి! బొక్కెనా తాడూ వుండాయిలె."

"నీ కదుపు చల్లగావుండ; ఎంత మంచి మాట చెప్పావయ్యా పెద్దమనిషీ" ఆనందం తన్నుకునిరాగా తబ్బిబ్బవుతూ అన్నాడు రాంపుల్లయ్య.

"ఇంతకీ మందేవూరు?"- అన్నాడా పెద్దమనిషి ఆరాగా, వూరికినే.

"ఈడకి పదిమైళ్ళు వుంటందిలే, రామాపురమనీ".

"అట్లనా? ఎందుకిట్లా ఎండని బడ్డా?? బస్సుకి పోరాదా? దబ్బులు పోయినా, ప్రాణం సుకపడుద్దిగ!"


"ఇదిగో! ఇంత వరకూ ఈ శాస్త్రి ఏనాడూ ఒక్కబస్సుగాని, రయిలుగాని, ఇమానం లాంటిదిగాని ఎక్కలేదు తెలుసా?"- అదేదో గొప్ప విషయమన్నట్టు గర్వంగా అతన్ని చూసాడు రాంపుల్లయ్య.

"అ మద్యదాకా నేనూ అంతేగాని — ఈమధ్యన దానెమ్మ - ఆకీళ్ళ వాతం వకటి వచ్చి బస్సుల నెక్కక తప్పటం లేదులే. అది సరేగాని ఎక్కడ్నుంచి వస్తున్నా?"

బస్తీలో అమ్మాయుందిలే మా ముసల్దిపోయి మూడేళ్ళయింది గదా. ఇక నాకు మాత్రం ఇంకా ఎవరున్నారు?! అల్లుడికి ఇచ్చింది ఇవ్వగా - వూళ్ళో నాకు ఇంకా నాలుగెకరాల కొండ్రవుందిగదా. అది చూసుకుంటా, మొండి చెట్టులాగా బ్రతుకుతున్నానా? అది కూడా రాసివ్వమని ఆ అల్లుడు అమ్మాయితో నాకు చెప్పించుతాడు? దాన్ని పగల గొయ్య? ఈ ఆశకి అంతులేదయ్యా, ఇంకా అక్కడ ఏముంది? అది అమ్మేసి వచ్చేసి నా దగ్గర వుండరాదా - అని అమ్మాయి అంటుందనుకో దాని ఆపేక్ష దానిది."

"మరి అట్లాగే చెయ్యరాదా? అమ్మాయి చెప్పిందాంట్లో బేనబబులేదే?!"

"కాదని నేనూ అనను" మావూరి పెసిడెంటు పున్నారావూ అదే అంటాడు! కాని - ఈ కాలూ చెయ్యీ ఆడినంతకాలం ఒకరి దగ్గర పడి వుండాల్సిన కర్మ నా కేంటయ్యా? ఎవరిచోట వారు వుంటేనే అభిమానాలూ అను



రాగాలూ నిలిచేది."

"నిజం అంతే గదా. నాకూ వున్నారులే ఇద్దరు కొడుకులు! పెళ్ళిళ్ళు ఇద్దరికీ చేసానా!- ఇక మొదలు కలతలు. అయిన దానికి కాని దానికి దెబ్బలాటలు. తల వాచి పోయి చస్తున్నాననుకో ఏం చెయ్యనూ!"

"—అవునయ్యా అసలు - పరాయి వాళ్ళనీడను పడివుండి గతి లేని వాళ్ళలాగా ఏడవటానిక్కి మనకేం కర్మ పట్టింది! ఈ నాటికి ఆ నాలుగెకరాల యవసాయమూ, వక్కచేతి మీదే లాక్కొనివస్తున్నాను! తెలుసా? అసలు మా అమ్మా బాబులు నాకేమిచ్చారు! బండిసున్న! కష్టపడి చమటోడ్చి పదెకరాలు కొంత్రి నంపాదించాను. ఈ భూమిలోనే పుట్టాను"భూమిలోనే చమట కార్చి కష్టపడ్డాను. భూమినే నమ్ముకుని ఈ నాటికి భూ కామందునయ్యాను. అంతా నాకష్టార్జితం. అందులో ఆరెకరాలు అమ్మాయికిస్తే అల్లుడు అమ్ముకు పోయాడు. బుద్ధిలేదు. పైగా ఆ మిగతా నాలుగెకరాలూ కావాలంటాడు. ఈ చేతుల్చూడు. అరవయ్యోపడి మీదకి వస్తావుందా! వొంటి చేతి మీద బియ్యబ్బస్తాని మోసీగలను."

"నేనూ అంతే వడ్లబస్తాని మోస్తానులే. పిల్లల మూలాన్న నాకు చీకూ చింతా ఎక్కువయి, అట్లా అయ్యానుగానీ-"

"బాగుంది నాయనా! నీ పేరేంటో చెప్పావుగాదు...."

"సుబ్బరంగయ్యంటారులే నన్ను. చింతల సుబ్బరంగయ్య."

"సుబ్బరంగయ్యా! ఒక్కమాట చెపుతావిను. ఈ బవబంధాలున్నయి చూడు జీవుడుని పుట్టిన వెంటనే తగుల్కొంటయి. అన్నీ తెలిసుండే-మనిషి భోల్తాపడక తప్పదు. ఏదీ నాదికాదు అని అప్పుడప్పుడూ అన్పించినా— "వీటి" నుండి తప్పించు కొనటం ఎవరికీవశంకాదు. నే నున్నాను. నాకు అన్నీ తెలుసనుకుంటాను. కానీ చిత్రం ఏమిటంటే-నాకు ఏమీ తెలియదనీ, నేను దేన్నుండీ తప్పించుకోలేననీ చివరికి తెలుసుకుంటాను. మనిషి బ్రతుకు ఇంతే నాయనా! ఇప్పుడు చూదరాదూ! పొలంలో పండిన కూరగాయలు - కూతురూ. కూతురుపిల్లలూతినాలన్న ఆపేక్షతో నిన్ననగా వూరువిడిచిపెట్టి ఆ కూరగాయలమూటని మోసుకుని కాళ్ళుగొట్టుకుంటూ బస్తీకెళ్ళాను! అవి ఇచ్చి - మరలా, నా పొలం ఏమవుతుందో ఏమో అన్న ఆపేక్ష కొద్దీ ఈరోజే వాళ్ళు వుండమని బలవంతం చేసినా వినకుండా, ఈ ఎండనుబడి కాల్తొచచ్చినట్లు తిరిగి పోతున్నాను. అందువలనా—"

"సీ బండబడ! ఏమయ్యా! నీ పేరేంటో!".

"రాంపుల్లయ్య అని పెట్టి చచ్చారులే మా అమ్మాబాబులు."

"ఓయి! రాంపుల్లయ్యా! ఇప్పటిదాకా దాహందాహం అంటివి! ఆదాహం సంగతే మర్చిపోయి మాటల్లోబడ్తివి! పో పోయి ఆ నూద్దగ్గర నీ దాహం తీర్చుకుని రావయ్యా తర్వాత చెప్దువుగాని నీ వేదాంతం."

"అట్లాగే" - అని, నూద్దగ్గర కెళ్ళి, బకెట్తో నీళ్ళు తోడుకుని - కడుపు నిండా తాగి, మరొక బకెట్ నీళ్ళతో కాలు చేతులూ, మొహమూ కడుక్కుని ఉస్సురని నిట్టూర్చి, అలుపుదీరి, తృప్తిచెంది - రాంపుల్లయ్య తిరిగి వచ్చాడో లేదో—

సుబ్బరంగయ్య లేచి పంచసర్దుకుంటున్నాడు. హడావుడి పడ్తున్నాడు,

"ఏంటయ్యో! పెద్దమనిషీ ఏంటా అడావుడి?" - రాంపుల్లయ్య అడిగాడు

"దూరాన ఎర్రగా దుమ్ములేచింది అవుపట్టంలా? బస్సు వస్తావుంది."

"ఈలోగా ఒక్కమాట చెప్తావిను. సుబ్బరంగయ్యా!"

"చెప్పు"

మనిషన్నాక ఈ బాధలూ గొడవలూ ఎప్పుడూ వుండేవే. కనుక కొడుకులు దెబ్బలాటలకి దిగారని నువ్వు దిగులుపడి కుంగి పోవాల్సిన అవసరం పడమాక నీ పని నువ్వుచేశావు. ఇక నువ్వు చేయగలిగిందిలేదు. మనం వచ్చేటప్పుడు తెచ్చింది ఏం లేదు. పోయేటప్పుడు పట్టుకుపోయేదీ ఏమీ వుండదు. జరిగేది జరక్క మానదు. తాగెటోడు కర్తాడు తాటిపన్ను అన్నట్లు- నీ కొడుకుల్నే ఏడవనీ ఆ తిప్పలన్నీ నువ్వుమాత్రం ఏదీ నీమనసుకు బట్టిచ్చుకోకుండా నీ ప్రయాణం నువ్వు సాగించి ధైర్యంగా నడిచిపో. ఇంతే నేను చెప్పగలిగింది .... కృష్ణారామా అనుకోవటమే మనలాటాళ్ళు చెయ్యవలసింది."—

బస్సువచ్చి ఆగింది, దుమ్ములేపుకుంటూ.

"వస్తామరి" అంగలు పంగలువేసి బస్సు దగ్గరికిపోతూ అన్నాడు సుబ్బరంగయ్య.

"అట్లాగే జాగ్రత్త"

"నువ్వు కూడా జాగ్రత్తగా వెళ్ళిరా పొయ్యేటప్పుడు మరిన్ని నీళ్ళు కడుపునిండాతాగిపో. అసలే ఎండలు!" - సుబ్బరంగయ్య హడవుడిగా వెళ్ళిపోయాడు. అత్నన్నెక్కించుకుని బస్సుసాగి పోయింది.

బస్సులో నుండి దిగిన ఒకరిద్దర్ని చూస్తూ నిలబడి పోయాడు రాంపుల్లయ్య, అక్కడ్నే.

పైపంచని సర్దుకుంటూ తన వయిపే సాగివస్తున్న ఆ పెద్దమనిషిని గుర్తించి రాంపుల్లయ్య కళ్ళు పెద్దగా అయ్యాయి.

"వార్నీ! ఏమయ్యా ప్రసిడంటూ! ఏంటి నువుఇక్కడ దిగబడ్డావిప్పుడు! ఏంటి విశేషం?" అన్నాడు రాంపుల్లయ్య.

ఈ ప్రక్కూర్లో మా బావవున్నాడు, ఆయన అర్జంటుగా రమ్మని కబురంపితేనూ"- నువ్వేంటి మరి? ఇక్కడున్నావు!

"అమ్మాయి దగ్గరికెళ్ళి పిల్లల్ని చూసి వస్తున్నాలే. నీతో అర్జంటుగా ఒకముక్క చెప్పాలయ్యా. వింటావా?"

"చెప్పుమరి.... నేనుబోయి, వచ్చూసుకుని ప్రొద్దుబోయేలోగా మనూరు చేరుకోనాలి మళ్ళా"

"చెప్తారామరి" అని ప్రసిడెంటుని చెయ్యిపట్టుకొని తీసుకెళ్ళి, మర్రిచెట్టునీ ఆ చల్లని నీడలో వున్నబావినీ చూపించాడు రాంపుల్లయ్య ఎండనబడి వచ్చావు దాహం తీర్చుకో - అని బక్కెటుతో నీళ్ళుతోడి అందించాడు చల్లని నీళ్ళతో మొహం, కాలు చేతులు కడుక్కొనమని సూచనలిచ్చాడు. అట్లాగేచేసి.

"ఇకచెప్పు" అన్నాడు ప్రసిడంటు తువాల్తో మొహం తుడ్చుకుంటూ.

"దాహంతీరిందా? ఇంకా నీరుకావాలా?"

"ఆఁ. ఇకవద్దులే ఇక చెప్పుమరి."

"మనూరి దగ్గర కూడా రోడ్డు మీద ఇట్లాంటి ఏర్పాటు కావలయ్యా. ఇట్లాగే ఒక చెట్టూ, నుయ్యీ, నీరూ...."

"ఓర్నీ బండబడ! కావాలంటే ఎట్లావచ్చుద్ది? దానికి డబ్బుగావాలి. ప్రసిడంటుని గదా - అని డబ్బు లేకుండానే ఇట్టాంటి పన్లన్నీ చెయ్యమని నన్నంటే ఎట్లా చెయ్యగల్ననీ! "ఎవరన్నా చెప్పేదానికి వివరం వుండాలిగదా,

"ఆగవయ్యా! రెండెకరాల పొలం తెగనమ్మి నీ చేతుల్లోపోస్తాను. ఏదో ఒక మంచిపని చెయ్యాలని బుద్ధి పుట్టిందిలే. నా కోరిక తీర్చేభారం నీది. అంతే నువ్వు వెంటనే పూనుకోవాలి." అని రాంపుల్లయ్య అన్నాడు, నిశ్చితంగా.

ప్రసిడెంటు ఆలోచనలో పడ్డాడు.

"ఆ డబ్బుచాలాదా? చాలదంటే చెప్పు"

"క్షేమగ్గా సరిపోతుంది,కాని...."

"మరెందుకాలోచన! అసలేంటి నీ సందేహం?"

"ఏం లేదులే. అట్లాగే చేద్దాం మరి వెళ్ళిరానా?"- నవ్వాడు ప్రెసిడెంటు.

"అట్లాగే! వెళ్ళిరా మరి! జాగర్త!"

ప్రసిడెంటు, రోడ్డుదిగి కాలిబాట వెంట చెట్లచాటున కనుమరుగయే దాకా చూసి తనూ నడక సాగించాడు రాంపుల్లయ్య. □